ong-9_ong-9.qxd 3/10/2026 1:00 AM Page 1



## పద్మనాభంలో పదివ తరగతి పరీక్షలకు 545 మంది విద్యార్థులు హాజరు

**పద్మనాభం, మార్చి 9,ప్రభాతవార్త**



మండలంలో పలు గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 16 నుండి ఏప్రిల్ ఒకటివ తేదీ వరకు జరగనున్న పదివ తరగతి పరీక్షలకు పద్మనాభం మండలంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి 545 మంది విద్యార్థులు హాజరకానున్నారని ఎంఈఓ టి రమణ చెప్పారు. అయితే ఈ సంవత్సరం రెడ్డిపల్లి, పద్మనాభం, ఆర్ వి పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాత్రమే పది పరీక్షా కేంద్ర కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు.మండలంలో ఉన్న 11 ప్రభుత్వ పాఠశాలల నుండి 442, మూడు ప్రైవేటు పాఠశాల నుండి 103 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారని చెప్పారు.ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. ఉదయం తొమ్మిది గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు.

## ఘనంగా మేధా ఫౌండేషన్ వార్షిక వేడుక

**గాజువాక,మార్చి 9,ప్రభాతవార్త**




మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్న సంస్థలను ప్రతిఒక్కరూ అభినందించాలని పెదగంట్యాడ వైద్యాధికారిణి డాక్టర్ పైడి హేమలత అన్నారు. చినగంట్యాడలో మేధా ఫౌండేషన్ వార్షిక వేడుకలు మేనేజింగ్ డైరెక్టర్ అత్తోట రవికుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిదిగా డాక్టర్ హేమలత పాల్గొని మాట్లాడుతూ సమాజ ప్రగతి కోసం అనేక సంస్థలు ఏర్పడుతున్నాయని కానీ అవి ప్రజలకు మరింత చేరువ కావాలని కోరారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఫౌండేషన్ చేపడుతోన్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. విశిష్ట అతిది ఉక్కు విశ్రాంత ఉన్నతాధికారి ఐవిజి రావు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా అట్టడుగున ఉన్నవారికి చేయూతనివ్వాలని కోరారు. అనంతరం వివిధ రంగాలలో మహిళలు అందించిన సేవలకు గాను డాక్టర్ హేమలత, జీలకర్ర భువనేశ్వరి, ఇప్పిలి ఇందిరా బాయి, అత్తోట విజయ కుమారి, మోడేకుర్తి అరుణ, గోనెమడతల శైలజ, కురచ వనిత వేణి, పిసిహెచ్ విజయకుమారి, పినపాటి వినయకుమారి, ఆళ్ల ప్రనూష తదితరుల మహిళలను ఘనంగా సత్కరించాలరు.

## గ్యాస్ పెంపుపై కట్టెల పొయ్యితో నిరసన

**గాజువాక,మార్చి 9,ప్రభాతవార్త**




కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను నిరసిస్తూ సోమ వారం 59వ వార్డు లేబర్ జంక్షన్‌లో ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. రహదారిపైనే కట్టెల పొయ్యి పెట్టి టీ కాచి అందరికీ పంచిపెట్టారు. ఐద్వా జోన్ కార్యదర్శి విమల, సిఐటియు నేత లక్ష్మణమూర్తి మాట్లాడుతూ.. పాల ధరలు, గ్యాస్ ధరలు పెంచి సామాన్యులపై మోడీ ప్రభుత్వం పెను భారం మోపిందని మండిపడ్డారు. ఎన్నికల వేళ ధరలు తగ్గిస్తామన్న కూటమి నేతలు.. ఇప్పుడు గ్యాస్ ధరలు పెరుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు బూడి శ్రీను, గంగాధర్, అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

## కెజిబివి విద్యార్థినిలకు బహుమతులు అందజేసిన ఎస్ఐ గణేష్

**పద్మనాభం,మార్చి 9, ప్రభాతవార్త**



మహిళా దినోత్సవం సందర్భంగా ఇటీవల కె జి బి వి పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థిను లకు సోమవారం విశాలాక్షి చారి టబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పద్మ నాభం ఎస్ ఐ గణేష్, రూపాలకుల రవికుమార్, మండల బిజెపి అధ్యక్షరాలు టి నాగమణి బహు మతులు అందజేసారు. ఈ సంద ర్భంగా గణేష్ మాట్లాడుతూ మహిళ ఈ సృష్టికి మూలమని,అందుకే దేవతగా కొలుస్తారని అన్నారు. ఇరవై మందికి బహుమతులు, ధృవపత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాలూరి కృష్ణారావు,మచ్చ సోమేశ్వరరావు, వెంకట్రావు, పేర్రాజు,కృష్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## జనావాసాల మధ్య మద్యం విక్రయాలొద్దు

**గాజువాక,మార్చి 9,ప్రభాతవార్త**




జీవీఎంసీ 58వ వార్డు కోరమండల్ గేటు సమీపంలోని బిజిఎం పాత్రుడు రెసిడెన్సీ వద్ద మద్యం షాపు ఏర్పాటును నిర సిస్తూ స్థానిక మహిళలు రోడ్డుపై బైఠాయించారు. ఉగాదికి ప్రారంభం కానున్న ఖిఅభినవ్ బార్‌ఖి వల్ల మహిళలు, విద్యార్థులకు ఇబ్బం దులు కలుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయాలు, పాఠశాలలు ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం తగదన్నారు. షాపు ను తొలగించే వరకుపోరాటం కొనసాగిస్తామని,కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తామని స్థానికులు హెచ్చరించారు.

## మహిళల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం: డిప్యూటీ మేయర్

**గాజువాక,మార్చి 9,ప్రభాతవార్త**

మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు అన్నారు. సోమవారం గాజువాక బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో ఆయన ఆధ్వర్యంలో అంత ర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలు, ఆర్పీలు, ఆశా వర్కర్లు, జనసేన వీర మహిళలను ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, ఇది మహిళా సాధికారతకు ఎంతో తోడ్ప డుతుందన్నారు. జనసేన పార్టీలో మహిళలకు సముచిత స్థానం ఉందని పేర్కొన్నారు. అంతకుముం దు మహిళలకు నిర్వహించిన ఆటల పోటీలు అలరించాయి. కార్యక్రమంలో నేతలు గడసాల అప్పా రావు, గంధం వెంకటరావు, డాక్టర్ హేమలత, ఉషా కిరణ్, నాగలక్ష్మి చౌదరి పాల్గొన్నారు.



## హెచ్‌సీజీ విజాగ్ పింక్ సఖి సారీ వాక్ 2026తో
# అంతర్జాతీయ మహిళా దినోత్సవం

### - క్యాన్సర్ నివారణ స్క్రీనింగ్‌పై అవగాహన

**విశాఖపట్నం, మార్చి 9, ప్రభాతవార్త**




హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని "పింక్ సఖి సారీ వాక్ 2026 కార్యక్రమాన్ని నిర్వహించింది. మహిళల్లో బ్రెస్ట్ మరియు సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం. బీచ్ రోడ్డులోని విశ్వప్రియకు ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రాంతంలో తెల్లవారుజామున జరిగిన ఈ వాక్‌లో వివిధ వయసుల నుంచి సుమారు 4,800 మంది మహిళలు పాల్గొన్నారు. ఇది నివారణాత్మక ఆరోగ్య సంరక్షణ మరియు ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతను మరింతగా ప్రతిబింబించింది. రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అవగాహనతో పాటు ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందించింది. రూ.200 నామమాత్రపు రిజిస్ట్రేషన్ ఫీజు (రోహిత్ మెమోరియల్ ట్రస్ట్‌కు విరాళంగా) చెల్లించిన మహిళలకు క్రింది ఆరోగ్య పరీక్షలు అందించారు:ఉచిత మామోగ్రామ్ పాప్ స్మియర్ పరీ క్షమహిళా క్యాన్సర్ నిపుణుడితో ఉచిత కన్సల్టేషన్ బీపీ రాండమ్ బ్లడ్ షుగర్ పరీక్షలు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు అక్కడికక్కడే వైద్యుల సూచనలు తీసుకోవడంతో పాటు మామోగ్రామ్ పాప్ స్మియర్ వంటి ప్రివెంటివ్ స్క్రీనింగ్ సేవల కోసం నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమం అనే థీమ్‌తో నిర్వహించబడింది. మహిళల ఆరోగ్య సమస్యలపై సమాజంలో ఉన్న సంకోచం మరియు అవగాహన లోపాన్ని తొలగించి, ఆరోగ్యంపై తెరచిన చర్చలను ప్రోత్సహించడం దీని ఉద్దేశ్యం.ఈ సందర్భంగా హెచ్‌సీజీ విజాగ్ క్లస్టర్ హెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డా. ఆదిత్య కౌరా మాట్లాడుతూ, "పింక్ సఖి సారీ వాక్ వంటి కమ్యూనిటీ కార్యక్రమాలు మహిళల ఆరోగ్యంపై చర్చలను ప్రజల మధ్యకు తీసుకువస్తాయి. మహిళలు పాల్గొని, తెలుసుకొని, స్క్రీనింగ్ చేయించుకునేలా ప్రోత్సహించడం ద్వారా ముందస్తు గుర్తింపుపై అవగాహన పెంచడం మరియు నివారణాత్మక ఆరోగ్య సేవలను సమాజానికి మరింత చేరువ చేయడం మా లక్ష్యం" అని అన్నారు. అదేవిధంగా హెచ్‌సీజీ విజాగ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డా. ప్రసాద్ ఐ.పి.సీహెచ్ మాట్లాడుతూ హెచ్‌సీజీలో అవగాహన కార్యక్రమాలు కేవలం సమాచారం ఇచ్చే స్థాయిలో కాకుండా, ప్రజలు చర్యలు తీసుకునేలా ఉండాలి అనే నమ్మకం ఉంది. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు రెగ్యులర్ స్క్రీనింగ్‌లు మరియు ప్రివెంటివ్ హెల్త్ చెకప్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రోత్సహిస్తున్నాం. ఇలాంటి సులభంగా అందుబాటులో ఉండే వేదికలు అవగాహన మరియు సమయానికి వైద్య సలహా మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో సహాయపడతాయి" అని తెలిపారు.

## ఘనంగా శంకర్ నారాయణ పుట్టినరోజు వేడుకలు

**గాజువాక, మార్చి 9,ప్రభాతవార్త**



జీవీఎంసీ 76వ వార్డు వైకాపా అధ్యక్షుడు మంత్రి శంకర్ నారాయణ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి గాజువాక నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్ ఉరుకూటి చందు, మహిళా విభాగం అధ్యక్షురాలు పల్లా చిన్నతల్లి ముఖ్య అతిథులుగా హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో శంకర్ నారాయణ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కులుకూరి మంగరాజు, కాశి, గోపీనారాయణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలి

### : మెడికవర్ వైద్య నిపుణులు

**ఆరిలోవ, మార్చి 9, ప్రభాతవార్త**




అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో "పర్పుల్ రైడ్" అనే ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లైఫ్ ఇన్‌ఫ్రా, ఆర్ఎస్ఏ మోటార్ పార్క్ సంస్థల సహకారంతో నిర్వహించారు. ఈ ర్యాలీలో 300 మందికి పైగా మహిళలు, రైడర్లు, వాలంటీర్లు, విద్యార్థులు మరియు సామాజిక సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ర్యాలీ మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆరిలోవ నుండి ప్రారంభమై అడవివరం వరకు కొనసాగింది. ప్రధాన లక్ష్యంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖపట్నం సిటీ పోలీస్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి. మేరీ ప్రసాంతి హాజరై మహిళల కోసం 10 వేల విలువైన కూపన్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డా. రవికిరణ్ తో పాటు మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు డా. సాహిత్య, డా. లలిత స్వర్ణ, డా. రమావత్ దేవ్, డా. కార్తీక్ చంద్ర వల్లమ్, డా. విద్యసాగర్ పాల్గొని మహిళల ఆరోగ్యం, క్యాన్సర్ నివారణ మరియు ముందస్తు స్క్రీనింగ్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ప్లాటిపస్ ఫౌండేషన్ విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న ఒక మెరైన్ కన్సర్వేషన్ ఎన్‌జిఓ సమాజ సంక్షేమం, మహిళలు తమ ఆరోగ్యాన్ని ప్రాధాన్యంగా తీసుకొని నియమిత ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు సూచించారు.

## నైపుణ్యాలతోనే మహిళల ప్రగతి

**గాజువాక,మార్చి 9,ప్రభాతవార్త**




మహిళలు నిరంతరం తమ నైపుణ్యాలకు పదును పెట్టుకుంటూ స్వశక్తితో రాణించాలని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) జిల్లా నోడల్ అధికారి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ గొప్ప వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే డబ్బు, కీర్తిప్రతిష్టలు వాటంతట అవే వరిస్తాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లాను, ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మిని, డాక్టరేట్ గ్రహీత డాక్టర్ సుధాను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

## నవ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకం

**మాధవధార, మార్చి 8, ప్రభాతవార్త**

సహనానికి ప్రతిరూపం మహిళలు అని, నవ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని మాధవధార జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా ఇటీవల విశాఖ జిల్లా బిజెపి మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలుగా నియమితులైన బగాది శ్యామలను ఆమె నివాసంలో మాధవధార జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ మహిళలు ఇంటిని,సమాజాన్ని ఉత్తమ స్థితిలో ఉంచేందుకు ఎల్లప్పుడూ పాటుపడతారన్నారు.నేటి సమాజంలో పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. బాలికలు విద్యార్థి దశ నుంచి ఉత్తమ విద్యను అభ్యసించి,బాల్యవివాహాలను అరికట్టి ఉన్నత విద్యలో రాణించి ఉత్తమ స్థాయిలో ఉండాలని, దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని, పురుషులతో సమానంగా స్త్రీలకు అనేక అవకాశాలు లభిస్తున్నాయన్నారు.మహిళ లేనిదే సమాజానికి మనుగడ లేదని,మహిళలు బలపడితే కుటుంబాలు,సమాజం బాగుపడతాయన్నారు.



## ఘనంగా శ్రీ బంగారమ్మతల్లి పండగ మహోత్సవం

**ఆనందపురం, మార్చి9, ప్రభాతవార్త:**



మండలంలోని చందక పంచాయతీ జగన్నాధపురం గ్రామంలో వేంచేసిన శ్రీ బంగారమ్మ పండగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. దీంతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్థానికంగా ఉన్న కోలాట బృందం గుడి వద్ద చేసిన సాహిత్యంతో కూడిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సం దర్భంగా రెండు వేల మంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమాలను శ్రీరామ యూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహించగా, గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## జనతా వారధికి విశేష స్పందన

**గాజువాక,మార్చి 9,ప్రభాతవార్త**



రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపు మేరకు చేపట్టిన "జనతా వారధి" కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పరశురాం రాజు ఆధ్వర్యంలో పలువురు బాధితుల సమస్యలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గాజువాక నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్, గాజువాక బీజేపీ ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ విజయానంద రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు గిరిజ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, రాకేష్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోండి

### - జీవీఎంసీ కమిషనర్‌కు బీజేపీ నేతల వినతి

**గాజువాక,మార్చి 9,ప్రభాతవార్త**



నగరంలో తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సూచనల మేరకు ఖిజనతా వారధిఖి కార్యక్రమంలో భాగంగా జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, దాడి రమేష్ తదితరులు కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## సామాన్యులపై గ్యాస్ భారం మోపడం అన్యాయం

**గాజువాక,మార్చి 9,ప్రభాతవార్త**




కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహిళా సమైక్య ఆధ్వర్యంలో భగత్ సింగ్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. జిల్లా కార్యవర్గ సభ్యురాలు గుడాల జయ మాట్లాడుతూ.. నిత్యవసరాల ధరలతో సతమతమవుతున్న సామాన్యులపై గ్యాస్‌భారం మోపడం అన్యాయమన్నారు. సూపర్ సిక్స్ హామీలతో వచ్చిన ప్రభుత్వం మహిళా దినోత్సవం వేళ ధరలు పెంచడం సరికాదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకురాళ్లు బిహెచ్‌ఇయమ్మ, లక్ష్మి, వరాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మహిళలకు సత్కారం

**ఆనందపురం, మార్చి 9, ప్రభాతవార్త:**



మహిళా దినోత్సవం సందర్భంగా ఆనందపురం ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా ఫాస్టర్ గ్లోరి పుష్ప మాట్లాడుతూ మహిళలు ఓర్పు సహనంతో ఉండాలని మంచి ఆలోచనలు తో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. మండల మాజీ మైనారిటీ కో ఆప్షన్ సభ్యులు జంగం జోషి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, మహిళలను అందరూ గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ సెక్రటరీ కోన ప్రకాష్, ఫాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు ఫాస్టర్ ప్రభుదాస్, కార్యదర్శి ఫాస్టర్ ఆనందరావు, జాన్ మోజేష్, గౌరవ అధ్యక్షులు ప్రశాంత కుమార్ , సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్‌నగర్‌లో శిలాఫలకం ధ్వంసం.. చెట్ల నరికివేత

**గాజువాక,మార్చి 9,ప్రభాతవార్త**



జీవీఎంసీ 71వ వార్డు శ్రీరామ్‌నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు బీభత్సం సృష్టించారు. 15 ఏళ్ల క్రితం నాటి మంత్రి, ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే గణబాబు ఇతర ప్రతినిధుల సమక్షంలో ప్రతిష్టించిన శంకుస్థాపన శిలాఫలకాన్ని సుత్తులు, గుణపాలతో పగలగొట్టి ధ్వంసం చేశారు. అంతేకాకుండా, దాదాపు 15 ఏళ్ల క్రితం నాటిన మొక్కలు నేడు పెద్ద వృక్షాలుగా మారి నీడను ఇస్తుండగా, వాటిని కూడా నిర్దాక్షిణ్యంగా నరికివేశారు. అడ్డుకోబోయిన వారిని దుర్భాషలాడుతూ, ఘర్షణ వాతావరణం సృష్టించినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. చారిత్రక ప్రాధాన్యత ఉన్న ఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ పప్పు రాజారావు అధికారులను డిమాండ్ చేశారు.

## గీత కార్మికులను ఆదుకోవాలి

**గాజువాక,మార్చి 9,ప్రభాతవార్త**



కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి భరోసానివ్వాలని విశాఖ జిల్లా యాత సంఘం అధ్యక్షులు అండిబోయిన అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి మరణించిన వారికే కాకుండా, కాళ్లు చేతులు విరిగి వైకల్యం పొందిన వారికి కూడా ఎన్టీఆర్ బీమా వర్తింపజేయాలని కోరారు. ఆరు నెలలు మాత్రమే వృత్తి ఉంటుందని, మిగిలిన కాలంలో మత్స్యకార, చేనేత కార్మికుల తరహాలోనే పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. తాటి ఉత్పత్తుల పరిశ్రమల ఏర్పాటు, అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి, రాములప్పడు తదితరులు పాల్గొన్నారు.

## బిజేపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌కి ఘనస్వాగతం

**గాజువాక,మార్చి 9,ప్రభాతవార్త**



చెన్నై నుండి విశాఖ వచ్చిన బిజేపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌కు విశాఖ విమా నాశ్రయంలో బిజేపి జిల్లా అధ్యక్షులు పరశురాం రాజు, రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, కృష్ణంరాజు, ఒమ్మి రంగనాయ కులు,కొల్లి మనోహర్,జగదీష్,బొత్స సురేష్, చెక్కాకుల రాంబాబు,రవిరాజు, శ్రీనివాస్ ఘణంగా స్వాగతం పలికారు. ఆయన రోడ్డు మార్గంలో బయలుదేరి తన నివాసంకి చేరుకున్నారు.

## మల్లవరం గ్రామంలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ రాజన్న శేషు..



ఎలమంచిలి మార్చి 9, ప్రభాతవార్త:

మండలంలోని రేగుపాలెం గ్రామపంచాయతీ శివారు మల్లవరం గ్రామంలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధుల నుండి పల్లె పండుగ-2 కార్యక్రమంలో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ రాజాన శేషు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజాన శేషు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా రోడ్లు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి చెందుతే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కృషితో గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 8.5 0 లక్షల రూపాయల వ్యయంతో ఈ సిమెంట్ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొక్కిరాపల్లి పిఏసిఎస్ చైర్మన్ గోపీ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, జనసేన నాయకులు అనపర్తి రాజు, మహాలక్ష్మి నాయుడు, లాలం సోమినాయుడు, మాజీ సర్పంచ్ కొల్లి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు, మాజీ జెడ్పిటిసి రాజాన నారాయణమ్మ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చైర్ పర్సన్ రమా కుమారుని సత్కరించిన టైలర్స్ సొసైటీ సభ్యులు...

ఎలమంచిలి మార్చి 09 ప్రభాతవార్త



అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఎలమంచిలి టైలర్స్ సొసైటీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారికి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. పెంజరువు దగ్గర జరిగిన సమావేశంలో సొసైటీ అధ్యక్షులు వియ్యపు సత్యనారాయణ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ మహిళ దర్జీ వేగి విజయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అతికిన శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతికిన శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళ మూర్తులు విద్య, ఉద్యోగం, వ్యాపార, రాజకీయ రంగాలలో రాణించాలని అన్ని రంగాలలో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి శేషుబాబు, కట్టా సత్యనారాయణ, సూరిబాబు, పిల్లా శివ, జి అప్పారావు, కే భద్రరావు, శంకర్రావు, పి రమణ, ఆడారి బాలదుర్గ, ఆర్ లక్ష్మి పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చూపించిన ఎంవిఆర్ తనయుడు రాజేష్ బాబు

### కాళ్లు లేని బాధితునికి ఆర్థిక సహాయం -సేవాభావం చాటుకున్న ఎంవిఆర్ కుటుంబం



అనకాపల్లి: మార్చి9, (ప్రభాత వార్త)

కష్టాల్లో ఉన్నవారికి చేయూతనివ్వడంలో ముం దుండే ఎంవిఆర్ కుటుంబం మరోసారి మానవ త్వాన్ని చాటుకుంది. ఎంవిఆర్ తనయుడు రాజేష్ బాబు రెండు కాళ్లు లేని దివ్యాంగుడి దయనీయ పరిస్థితిని తెలుసుకుని వెంటనే స్పందించారు. యాక్సిడెంట్‌లో రెండు కాళ్లు కోల్పోయిన బాధితుడు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న రాజేష్ బాబు చలించిపోయారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని నర్సింగరావుపేటలో గల ఎం.వి.ఆర్ ప్రధాన కార్యాలయంనకు వచ్చి, తన సమస్యను వివరించిన పట్టణంలోని గవరపాలెంలో అద్దెకు నివాసం ఉంటున్న ఆర్.వెంకట రమణ అనే బాధితుడుకు... భవిష్యత్తులో అతనికి కృత్రిమ కాళ్లు (కృత్రిమ అవయవాలు) అమర్చు కునేందుకు ఉపయోగ పడేలా రూ.20 వేల రూపాయల ఆర్థిక సహాయం అంద జేశారు. తమ కార్యాలయానికి వచ్చిన బాధితుడిని స్వయంగా పరామర్శించి ఆయనకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బాధితుడికి ధైర్యం చెప్పి, అవసరం ఉన్నప్పుడు తాము అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కష్టాల్లో ఉన్నవారికి చేయూత ఇవ్వడం మనందరి బాధ్యత అని రాజేష్ బాబు తెలిపారు. మాలాగ.. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం ఎంవిఆర్ కుటుంబానికి ప్రత్యేకతగా మారిందని బాధితుడు వెంకటరమణ ప్రశంసించారు.

## రైల్వే స్టేషన్ రోడ్డు పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు

ఎలమంచిలి మార్చి 9 ప్రభాతవార్త




పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ప్రధానోపాధ్యాయురాలు ఎన్ఎన్ ల్ డి భవాని మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ షేక్ సయ్యద్ బీబీ, మహిళా ఉపాధ్యాయులు డివి భారతి, జిఎస్ కామేశ్వరి టీ.ఇందిరా రాణి, ఎస్వీఎన్ఎస్ వరలక్ష్మి,ను ఉపాధ్యాయులు విద్యార్థుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మలిపాటి సత్యనారాయణ మాట్లాడుతూ స్త్రీ తల్లిగా, సోదరిగా, భార్యగా వివిధ రకాల బాధ్యతలు మోస్తూ కుటుంబాన్ని సమాజాన్ని చక్క దిద్దుతుందని తెలియజేశారు.వారిని సమాజం ఎల్లప్పుడూ గౌరవించాలని తెలియజేశారు.అనంతరం పిల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం విశేషాలు విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కే రాజేష్, ఎన్ వి ఆర్ ఎం కిషోర్, బి నరేంద్ర, వై భాస్కరరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అంకిత భావంతో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



అనకాపల్లి, మార్చి 9, ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ లో వచ్చిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు వినతుల స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, పి జి ఆర్ ఎస్ కు విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని, అందువల్ల అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 131 అర్జీలు అందగా, రెవెన్యూ క్లినిక్ కు 159 వినతులు అందాయి. మొత్తంగా 290 అర్జీలు స్వీకరించినట్లుగా తెలిపారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌లలో పాల్గొన్నారు.

## వ్యాక్సిన్ అవగాహన పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

అనకాపల్లి మార్చి 9 (ప్రభాత వార్త)



సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో హెచ్ పి వి వ్యాక్సిన్ అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు., డిఎం అండ్ హెచ్ ఓ హైమావతి, డిసిహెచ్ ఎస్ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్.ఈ.సి.ఎస్ పాలిటెక్నిక్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు




కసింకోట, మార్చి 9, ప్రభాత వార్త;

స్థానిక రాజీవ్ గాంధీ ఆర్.ఈ.సి.ఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో అచ్యుతాపురం లోని యాక్షన్ టెసా అనే మాన్యు ఫాక్చరింగ్ యూనిట్ కొరకు డిప్లొమా మెకానికల్, ఆటోమొబైల్, ఇన్స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు 11వ తేదీన అనగా బుధవారం నాడు నిర్వహించబడును అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఉమా శంకర్ తెలియచేశారు. ఎంపిక అయిన అభ్యర్థులకు నెలకు 15 వేల రూపాయలను నెలవారీ జీతం ఉంటుందని, 2025 -2026 సంవత్సరాలలో ఉత్తీర్ణులై, డిప్లొమా విద్యార్హత కలిగిన అభ్యర్థులు వారి రెజ్యూమే, సర్టిఫికెట్ ల జెరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తీసుకుని ఉదయం 9.30 గంటలకు కళాశాలలో జరిగే ప్రాంగణ ఎంపికల హాజరు అవ్వాలని తెలియచేశారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రిన్సిపల్ శ్రీ కె శివ, విభాగాధిపతులు, ఆఫీస్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు

అనకాపల్లి రూరల్ మార్చి 9 (ప్రభాత వార్త)



అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ప్రధానోపాధ్యాయులు కె ఎస్ ఎస్ శాస్త్రి, పెనుమత్స కృష్ణంరాజుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు రత్నమణి, అనసూర్యా, శారద, నాగ లక్ష్మి, రాజ్య లక్ష్మి, సుబ్బ లక్ష్మి, హిమవతి, లలిత, రత్నంలను సత్కరించి, జ్ఞాపికలను బహుకరించారు. కార్యక్రమంలో ఎస్ వై. అలీ, రాజకుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సైనిక్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లి మార్చి 9, ప్రభాతవార్త

పట్టణ ప్రాంతంలో వున్న బాసర అకాడమీలో కోచింగ్ తీసుకున్న బుద్ధ వరుణ్ కుమార్, నంబారు షణ్ముఖ అనే విద్యార్థులకు కేంద్ర స్థాయిలో నిర్వహించే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అత్యంత కఠినమైన, అధిక సంఖ్యలో పోటీ వుండే ఎన్ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ నాయుడు తెలిపారు. ఇటీవల విడుదలైన సైనిక్ పరీక్షలోనూ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారని తెలియజేశారు. విజయనికి కారకులైన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు నాయుడు కృతజ్ఞతలు తెలియజేసారు.

## జిల్లా వైసీపీ యువజన విభాగ కార్యదర్శిగా చిన్నారావు

అనకాపల్లి మార్చి 9,ప్రభాతవార్త



చోడవరం మండలం ముద్దుర్తి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు బొండచిన్నారావు అనకాపల్లి జిల్లా వైసిపి యువజన విభాగం కార్యదర్శిగా నియమింపబడ్డారు. ఈ మేరకు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుండి సోమవారం ప్రకటన విడుదలయ్యింది. ఈసందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ తనపై నమ్మకముంచి భాధ్యతలప్పగించిన వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసారు. తనకు అప్పగించిన బాధ్యతతో వైసిపి భాలోపేతానికి కృషి చేస్తానన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ మాజీ శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, అన్నంరెడ్డి అదీప్ రాజ్, చోడవరం నియోజక వర్గ వైసీపీ నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేసారు.

## అంజిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన శ్రీను



చోడవరం, మార్చి 9, ప్రభాతవార్త

చోడవరం చెందిన వైసిపి నాయకుడు పార్టీ సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రెటరీ పందిరి శ్రీను సోమవారం తాడేపల్లి పార్టీ ఆఫీసులో ఏపీ స్టేట్ సోషల్ వింగ్ చైర్మన్ దొడ్డి అంజి రెడ్డి ని మర్యాదపూర్వశీగా కలిశారు. సందర్భంగా అనకాపల్లి జిల్లాలో పార్టీ పరిస్థితి గురించి సోషల్ మీడియా వింగ్ కార్యకలాపాల గురించి చర్చించినట్టు చెప్పారు. పార్టీ సోషల్ మీడియా మరింత బలోపేతం కావాలని సూచించారు అన్నారు.

## గంజాయి రవాణాదారులకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

### జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా -చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు సంచలన తీర్పు

చోడవరం, మార్చి 09, ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లాలో గంజాయి అక్రమ రవాణా కు పాల్పడే వారిపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతుందని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. 2016లో చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 148 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులకు సోమవారం చోడవరం కోర్టు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించిందనీ తెలిపారు. చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.హరి నారాయణ ఈ కేసులో నిందితులైన వంతల జయరాం, గొల్లూరి భీమరాజు లపై మోపబడిన నేరం నిరూపితం కావడంతో నిందితులు ఇరువురికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష. ఒక్కొక్కరికి రూ.1,00,000 చొప్పున జరిమానా విధించారన్నారు. ఒకవేళ జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో 2 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటది అన్నారు. ఈ కేసు వివరాలు పరిశీలిస్తే 2016 సెప్టెంబర్ 2న, చోడవరం మండలం గౌరపట్నం గ్రామ సమీపంలో 148 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితులను అప్పటి చోడవరం ఎస్సై పి.నరసింహమూర్తి సిబ్బంది పట్టుకున్నారు. నిందితులపై పక్కా ఆధారాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎస్సై ని వారి బృందాన్ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఈ కేసులో రీజినల్ ఎగ్జామినేషన్ లాబొరేటరీ ఫోరెన్సిక్ రిపోర్టులను ఇతర కీలక సాక్ష్యాధారాలను కోర్టులో సమర్థవంతంగా ప్రవేశపెట్టి, నిందితులకు శిక్ష పడేలా వాదించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురుపల్లి..సూర్యనారాయణ ని, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బందిని చోడవరం పోలీసులను ఎస్పీ ప్రశంసించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం అనకాపల్లి జిల్లా పోలీసులు అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. శాస్త్రీయ ఆధారాలతో నిందితులకు శిక్షలు పడేలా చేయడం ద్వారా నేరస్థుల్లో భయాన్ని కలిగిస్తున్నాము. యువత భవిష్యత్తుతో ఆడుకునే గంజాయి స్మగ్లర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టము," అని ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా హెచ్చరించారు.

## స్వచ్ఛంద సేవ చేయటం నా పూర్వజన్మ సుకృతం : పులి సత్తిబాబు



( ఎస్ రాయవరం మార్చి 9 ప్రభాత వార్త)

మండల కేంద్రమైన ఎస్ రాయవరం గ్రామంనకు చెందిన పులిసత్తిబాబు దంపతులు సోమవారం గ్రామంలో గల ఆలయాల అర్చకులకు బియ్యము. పప్పు దినుసులు. కాయ కూరలు. అందజేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ.. ఇటువంటి సేవా కార్యక్రమంలో చేయడం నా పూర్వజన్మసుకృతం అని ఆయన అన్నారు.దుర్గంబి ఆలయ అర్చకులు రంగస్వామి కి నూకాంబిక ఆలయ అర్చకులు వెంకటరావుకి శివాలయంలో బుగ్రేశ్వర స్వామి కుమారుడు కి.వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు చక్రవర్తికి. గ్రామ అర్చకులు ప్రకాష్ శర్మకి (స్వయంపాకం) బియ్యము పప్పు దినుసులు. కాయగూరలు అందజేశారు.

## మత్స్యకారులకు చేపల వేట సమయంలో జాగ్రత్తలపై అవగాహన

నక్కపల్లి, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర హోం శాఖ మంత్రివర్యులు వంగలపూడి అనిత ఆదేశాల మేరకు నక్కపల్లి మండలం రాజ య్యపేట గ్రామంలో చేపల వేటలో నిబంధనలపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సదస్సులో కాస్ట్ గార్డ్ సిబ్బంది రోహిత్, కిషోర్ మత్స్యకారులకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేట సమయంలో గుర్తింపు కార్డులు, లైఫ్ జాకెట్ తప్పనిసరిగా తీసుకెళ్లాలని, ప్రమాద సమయంలో 1554 టోల్ ఫ్రీ నెంబర్ సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజయ్యపేట తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, ఐటిడిపి జిల్లా కమిటీ సభ్యులు మడదా రాంబాబు, యజ్జల లోవరాజు, మత్స్యకార సిబ్బంది నాగమణి, రజిని, మత్స్యకారులు మైలపల్లి రాము, గోసల స్వామి, పిక్కి నూకరాజు, యజ్జల అప్పలరాజు, జగ్గ, శ్రీనులు ఉన్నారు.






## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

(ఎస్ రాయవరం మార్చి 9 ప్రభాత వార్త)



ఎస్ రాయవరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఓ పీ.మీనా కుమారి ఆధ్వర్యంలోమహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.మండల పరిషత్ సిబ్బంది మరియు పంచాయతీ కార్యదర్శిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మహిళలు అన్ని రంగాలలో ముందు ఉన్నారని.మహిళలు పోటీతత్వంతో పనిచేయాలని మహిళలు అసలైన సమాజ నిర్మాతలు అని వారి సేవలు ప్రశంస దాయకమన్నారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ.. మహిళలు అనాది కాలం నుండీ స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్నారని వారిని గౌరవించడం మనందరి బాధ్యత అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం వార్డు సచివాలయం డిప్యూటీ ఎంపిడిఓ సతీష్ కుమార్. ఏవో రమేష్ బాబు. పంచాయతీల కార్యదర్శులు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈ పంట ముసాయిదా జాబితా ఆర్ఎస్‌కేలలో ప్రదర్శన



(నక్కపల్లి, ప్రభాతవార్త)

వ్యవసాయ పథకాలు అందాలి అంటే ఈ పంట జాబితాలో నమోదు చేసుకొని ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ రైతులకు సూచించారు నక్కపల్లి మండలం లోని వివిధ రైతు సేవ కేంద్రాలలో ఈ - పంట రబీ 2025 యొక్క సామాజిక తనిఖీ డ్రాఫ్ట్ లిస్ట్ ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించారు. వివిధ రైతు సేవ కేంద్రాలలో ఉన్న రైతులు అందరూ కూడా వారి పంట వివరములు సరిగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఏమైనా సవరణలు ఉన్నచో ఆర్ ఎస్ కె సిబ్బందిని కలిసి సరి చేసుకోవాలని. తదనంతరం ఫైనల్ ఈ -పంట జాబితా ప్రదర్శించ పడుతుందన్నారు. ఈ పంట రబీ 2025లో సాగు చేసిన ప్రతీ రైతు కూడా నమోదై ఉండాలని, ఈ- పంట నమోదు వలన రైతులకు వ్యవసాయ పథకాలు లబ్ధి చేకూరుతాయి అన్నారు. పంటల ఉత్పత్తి కొనుగోలు, అన్న దాత సుఖీ భవ, పి ఎం కిసాన్, పంట రుణాలు, పంటల భీమా, వ్యవసాయ యాంత్రీకరణ ,ఇన్పుట్ సబ్సిడీ ,ఎరువులు రాయితీ పై విత్తనాల పంపిణీ మొదలగు లబ్ధి చేకూరాలి అంటే ఈ పంట నమోదు తప్పని అన్నారు. ఈ క్షేత్ర పర్యటన లో ఏఈఓ సత్యనారాయణ, సాయి,వ్యవసాయ సహాయకులు గాయత్రి,కొండలరావు,ధనరాజు, రైతులు పాల్గొన్నారు.

## నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న ఆడారి ఆనంద్ కుమార్

ఎలమంచిలి మార్చ్ 09 ప్రభాతవార్త





పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న నూకాంబిక అమ్మవారిని సోమవారం బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆడారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ నూకాంబిక అమ్మవారి ఉత్సవ ఏర్పాట్లను కమిటీ వారిని అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం సుమారు 6 లక్షల వ్యయంతో షెడ్డు గదులు నిర్మిస్తానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎస్ లక్ష్మీనారాయణ, గంధం శివ, నూకరాజు, శంకర్రావు,బిజెపి నాయకులు ఆడారి వెంకట్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం

ఎస్ రాయవరం మార్చి 9 ప్రభాతవార్త



మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురం గ్రామంలో వేంచేసి ఉన్న ఆంజనేయస్వామి వార్షి కోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకు జామున భక్తులు ఆలయం నకుచేరుకొని పంచామృత అభిషేకము లు సింధూర కుంకుమ తమలపాకుల అర్చనలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదంలు స్వీకరించారు. సాయంత్రం భజన బృందాలచే భక్తి గీతాలు ఆలపించారు. పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్.రాయవరం గ్రామంలో వివిధ సమస్యలపై వినతి పత్రములు అందజేసిన సోమిరెడ్డి రాజు



ఎస్,రాయవరం మార్చి 9 ప్రభాతవార్త

ఎస్.రాయవరం గ్రామంలో వివిధ సమస్యలపై సోమ వారం విజయవాడలో వివిధ శాఖల అధికారులకు వినతి పత్రములు అందజేశామని సోమిరెడ్డి రాజు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మండల కేంద్రమైన ఎస్.రాయవరం మేజర్ పంచాయతీ మహాకవి గురజాడ అప్పారావు జన్మస్థలం అయిన ఎస్.రాయవరం గ్రామంలో కనీసం ప్రాథమిక వైద్య కేంద్రం (పి.హెచ్.సి) కూడా లేనందున ఏడాది కాలం క్రితం లింగరాజుపాలెంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల లింగరాజుపాలెం నుండి సర్వసిద్ధి ప్రాథమిక వైద్య కేంద్రంలోని ఒక గదిలోకి మార్చడంతో ప్రజలకు సక్రమంగా ఉపయోగపడక నిరుపయోగంగా ఉన్నందున ఎస్.రాయవరంకు మార్పు చేసి ఎస్.రాయవరం, సమీప 15 గ్రామ ప్రజల వైద్య అవసరాలు తీర్చడానికి న్యాయం చేయాలని మండల కేంద్రం అయినా ప్రభుత్వ జూనియర్ కళాశాల (జి.జె.కాలేజి) మంజూరు చెయ్యాలని.గతం ప్రభుత్వ హయాంలో నుండి విజ్ఞాపనలు చేసినా పలితం లేకపోవడం జరిగిందని. ప్రస్తుత ప్రభుత్వంలో హోం మంత్రి వంగలపూడి అనిత కృషితో ఎస్.రాయవరంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల మంజూరు చేశారని అయితే మండలం లోని కొరుప్రోలులో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ఉన్నందున ఎస్.రాయవరంలో మంజూరైన ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలను ప్రభుత్వ జూనియర్ కళాశాల (కొ-ఎడ్యుకేషన్)గా మార్పు చేసి మంజూరైన కాలేజిని ఈ విద్యా సంవత్సరం 26-27 నుండి ప్రారంభం చేయాలని ఎస్.రాయవరం గ్రామం శ్రీ నూకాంబికా అమ్మవారి దేవాలయం ఎదురుగా ఉన్న భూమి 0.27 సెంట్లు భూమిని ఒక్క రూపాయి చెల్లిశీచకుండా, ఇక్కడ నుండి బస్సులు నడుపుతామన్న నిబంధనలతో తీసుకొని 0.03 సెంట్లలో నిర్మించిన కాంప్లెక్స్‌ను స్థలశీను అద్దెలకు ఇస్తున్నందున, నిబంధనల వ్యతిరేకంగా ఒక్క రూపాయి చెల్లిశీచకుండా, ఒక్క బస్సు నడపనందున తక్షణం ఈ స్థలంను తిరిగి అప్పగించాలని విజయవాడలో ముఖ్యమంత్రి, మానవ వనరుల శాఖ మంత్రి, హోం శాఖ మంత్రి, రవాణా శాఖ మంత్రి, సంబంధిత రాష్ట్ర అధికారులు వినతి పత్రములు అందజేశామన్నారు.

## సూర్య భరత్ వివాహ కార్యక్రమంలో పాల్గొన్న పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త కంబాల జోగులు



ఎస్.రాయవరం మార్చి 9 ప్రభాతవార్త

విశాఖపట్నం వాస్తవ్యులు సానా సూర్య భరత్ వివాహ కార్య క్రమంలో సోమవారం మాజీ శాసనసభ్యులు పాయకరావు పేట నియోజకవర్గం సమన్వయకర్త కంబాల జోగులు, సందీప్ పాల్గొన్నారు.

pages:pages.qxd 3/9/2026 11:54 AM Page 1



విజయనగరం పార్వతీపురం మన్యం
వార్త

## గ్యాస్ ధరల పెంచి మహిళలకు మంచి గిఫ్ట్ ఇచ్చారు..

### జడ్పిటిసి వలి రెడ్డి శిరీష ఆవేదన..



చీపురుపల్లి మార్చి 9 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మహిళా దినోత్సవ సందర్భంగా గ్యాస్ ధరలను పెంపుదల చేసి ప్రభుత్వాన్ని నమ్ముకున్న ఆడపడుచులకు నమ్మక ద్రోహం చేశారని చీపురుపల్లి జడ్పిటిసి వల్లి రెడ్డి శిరీష ఆరోపించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కూటమి పాలకులను నమ్మి ఓటేసినందుకు మహిళలకు మంచి బుద్ధి చెప్పారని ఆమె వ్యాఖ్యానించారు. నిత్యవసరాల ధరలను సైతం అదుపు చేయలేని చేతకాని కూటమి ప్రభుత్వం భవిష్యత్తులో ఎదురుదెబ్బ తినక తప్పదని హెచ్చరించారు. ఆదాయాలు పెరగక ఆర్థిక ఇబ్బందుల్లో సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు పెరిగిన ధరలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె అన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులను ప్రభుత్వమే భరించాలి అని ఆమె సూచించారు.. కేంద్ర, రాష్ట్రాల కూటమి ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలకి గిఫ్ట్‌గా మహిళపై భారం మోపెందుకే గ్యాస్ ధరలను అమాంతంగా పెంచారని, వంటగ్యాసుపై 60 రూపాయలు, కమర్షియల్ గ్యాస్ బండపై 115 రూపాయలు,అలాగే వంటనూనె ధరలు కూడా భారీగా పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య, మధ్యతరగతి మహిళలకు ప్రజలకు,ఈ కూటమి ప్రభుత్వం పెంచిన ధరలు శరాఘాతం అని అన్నారు, దీనికి బదులుగా వచ్చే ఎన్నికల్లో కూటమి పాలకులకు ప్రజలు రిటర్న్ గిఫ్ట్ ఇస్తారన్నారు. ఆంధ్రాలో గ్యాస్ నిక్షేపాలు సమృద్ధిగా ఉన్న ధరలు పెంచి కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పెంచిన గ్యాస్ ధర తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడి రష్యా నుండి ఆయిల్ కొనుగోలుపై ఆంక్షలు సాకుగా చూపుతూ గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. గ్యాస్ భారాన్ని ప్రజలపై నెట్టడం ఘోరమన్నారు. ఇప్పటికే నిత్యవసరుకుల ధరలు పెరిగి సతమతమవుతున్న సామాన్యులపై వంటగ్యాస్ ధర పెంపు వంట నూనె ధరలు పెంపు మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు చందంగా ఉందన్నారు. అలాగే ఉపాధి కోసం తోపుడు బళ్ళు ఇతర చిన్న చిన్న వ్యాపారాలతో కుటుంబాలను పోషించుకుంటున్న చిరు వ్యాపారులను వాణిజ్య సిలిండర్ ధర పెంపు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. అన్ని విధాలుగా ప్రజా జీవితాన్ని ఘోరంగా నష్టపరిచే గ్యాస్ ధర పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో వచ్చిన ఒడిదుడుకుల నేపథ్యంలో వచ్చిన ఆయిల్ ధరల వ్యత్యా సాలను ప్రభుత్వమే భరించాలి తప్ప ఇలా ప్రజలపై భారం మాపడం సరికాదన్నారు. ఇది సరైన పాలనకు సూచన కాదన్నారు. తక్షణమే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని వలిరెడ్డి శిరీష డిమాండ్ చేశారు.

## వైభవంగా బొత్స గౌరమ్మ పేరంటాలు ప్రతిష్ట ఉత్సవం

గరివిడి మార్చి,9 ప్రభాత వార్త



మండలంలోని గదబ వలసలో వెలసిన బొత్స గౌరమ్మ పేరంటాలు నాల్గవ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మ వారికి పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బొత్స సత్యం,రాము, బొత్స రమణ,రమ దంపతులు ప్రభృతులు కార్యక్రమ నిర్వాహక కర్తలు గా వ్యవహరించారు.గౌరమ్మ పేరంటాలు అమ్మవారికి నూతన వస్త్ర ధారణ తో మంగళ వాయిద్యాల నడుమ వేడుకగా ధూప దీప నైవేద్యాలు తో పూజలు నిర్వహించి భక్తి ప్రపత్తులను చాటు కున్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక, జానపద కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. సన్నాయి మేళాలు, డప్పు చప్పుళ్ళు తో గ్రామం ఒక్కసారిగా పులకించి పోయింది. గ్రామ దేవత గౌరమ్మ గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని ప్రసాదించాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఉత్సవం నేపథ్యంలో గదబ వలసలో ఆధ్యాత్మిక శోభ సంతరించింది.

## గిరిజన మహిళకు పెరటికోళ్ళ పెంపకంపై అవగాహన



పాచిపెంట మార్చి 9 ప్రభాతవార్త

స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించాలనే లక్ష్యంతో హీఫర్ ఇంటర్నే షనల్, ట్రైకార్, ఐటిడిఏ, మరియు పశు సంవర్ధక శాఖ, సంయుక్త ఆధ్వర్యంలో, రూరల్ ఎన్విరాన్మెంట్ వ్యవసాయ అభివృద్ధి సొసైటీ గిరిజన మహిళలకు అవగాహన సదస్సును పశుసంవర్ధక శాఖ ఏ.డి. డి ఆర్ గంగాధర్ ఏర్పాటు చేశారు. మండలంలో మంచాడ వలస గ్రామంలో “సమగ్ర పెరటికోళ్ళ యూనిట్” నిర్మాణం పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో భాగంగా కోళ్ల గూళ్ళ నిర్మాణ పద్ధతులు, కోడి పిల్లల మధ్య సరైన దూరం, స్థానిక పదార్థాలతో కోళ్ళ మేత తయారీ సూత్రాలు, వేసవి వేడి మరియు చల్లా గాలుల నుంచి రక్షణ చర్యలు, ఒత్తిడి తగ్గించే విదనం, అలాగే గుడ్లు పెట్టడం, సేకరణ మరియు బ్రూడింగ్ విధానాలు మరియు కోళ్ళకు టీకాలు వాటి ఉపయోగాల వంటి అంశాలపై నిపుణులు ప్రాయోగిక మార్గదర్శకాలు అవగాహన శిక్షణలో మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పాత్రో, డిఆర్ గణేష్, శ్రీధర్ ప్రవల్లిక, హాఫర్ ఇంటర్నేషనల్ పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి

### మనస్తత్వ నిపుణుడు డా.నిల్సన్



నెల్లిమర్ల, మార్చి 9, ప్రభాతవార్త

వైద్య కళాశాల విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని ప్రముఖ మన స్తత్వ నిపుణుడు డా.నిల్సన్ సూచించారు. వైద్య కళాశాలలో ఇటీవల పెరిగిన వైద్య విద్యార్థుల ఆత్మహత్యల సంఘటన నేపథ్యంలో ఆత్మహత్యలు నివారిం చేందుకు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో నిర్వహిస్తున్న అవగాహన శిబిరాల నిర్వహణలో భాగంగా నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాల లో సైకియాట్రీ విభాగం అధిపతి డాక్టర్ హేమంత్ మాధవ్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య విద్యార్థులకు అవగాహన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో మనస్తత్వం నిపుణుడు నిల్సన్ మాట్లాడుతూ విద్యార్థులకు, కళాశాల యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. వైద్య విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు అవసరమైన మార్గాలను అనుసరించాలని ఆయన సూచించారు. సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదనే విషయాన్ని ప్రతి వైద్య విద్యార్థి తెలుసుకోవాలని అన్నారు. కళాశాల యాజమాన్యాలు కూడా ఈ తరహా ఆలోచనలు ఉన్న విద్యార్థులను వారి వ్యవహార శైలిని బేరీజు వేసుకొని గుర్తించాలని ఇందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. వైద్య విద్యార్థుల్లో దేశంలో 27.8 శాతం మంది మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని,16.2 శాతం మంది ఆత్మహత్య ఆలోచనల్లో ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయని ఆయన వివరించారు. 48 శాతం మంది విద్యార్థులు డిప్రెషన్ తోను, 54 శాతం మంది ఆందోళనతోను, 50 శాతం మంది ఒత్తిడితోనూ బాధపడుతున్నారని తెలిపారు. వైద్య విద్యార్థుల్లో ఆత్మహత్యల నివారణకు కళాశాల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని ఆయన సూచించారు. కౌన్సిలింగ్ సెంటర్లు, టెలి కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని, మానసిక ఆరోగ్య కమిటీలు వేయాలని ఆయన సూచించారు. నిల్సన్‌తో పాటు డాక్టర్ హేమంత్ మాధవ్, డా.సంగీత, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేన సభ్యత్వ నమోదు



కురుపాం, మార్చి9 ప్రభాతవార్త

జన సేన సభ్యత్వ నమోద కార్యక్రమాలను మండల జనసేన పార్టీ అధ్యక్షుడు నేరేడుపల్లి వంశి ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం మండలంలో కురుపాం పంచాయతీ కస్పా గదవ వలస లో పలువురిని నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సేవలు, ఆకర్షణీయమైన పరిపాలనా విధానానికి ప్రజలు ఆకర్షితులై జనసేన పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని ఆయన అన్నారు. పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ విశేషం గా కృషి చేస్తున్నారని అన్నారు.. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, డోలీమోతల్లేని రహదారిల నిర్మాణం లో పవన్ కల్యాణ్ చర్యలు కీలకం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈఏడాది సభ్యత్వ నమోదు అధిక సంఖ్యలో జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మురళి, రవి, వెంటరమణ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై వారపు సంతలో అవగాహన

కురుపాం మార్చి 9 ప్రభాత వార్త



మండలం నీలకంఠాపురంలో జరుగు సంతలో సైబర్ నేరాలపై పలు చట్టాలపై నేలకంఠాపురం ఎస్సై నీలకంఠం అవగాహన కార్యక్రమంలో చేపట్టారు. సోమవారము ఆయన నీలకంఠాపురం వారపు సంతను సందర్శించి అక్కడ మారుమూల గ్రామాల నుండి వచ్చిన ప్రజలతో సమావేశం ఏర్పాటుచేశారు. సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీ, డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, మహిళల భద్రత చట్టాలు మరియు ఈ గవర్నెన్స్‌లో పోలీస్ సేవలు ఏ విధంగా వినియోగించుకోవాలో వంటి వాటిపై అవగాహన కల్పించారు.

## ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకొనేందుకే ప్రజా దర్బార్



కురుపాం, మార్చి9 ప్రభాతవార్త

ప్రజల సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించే విధంగా ప్రజా దర్బారు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రభుత్వ విప్ ఎంఎల్ఏ తోయక జగదీశ్వరి అన్నారు సోమవారం ఆమెక్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ ప్రజాదర్బారుకు నియోజక వర్గానికి చెందిన వివిధ గ్రామాల నుంచి హాజరైన ప్రజలు తమ గ్రామాలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే కి వినతి లను అందజేసి వివరించారు. పలు అంశాలపై ప్రజలు తమ ఆవేదనను తెలియజేశారు. ముఖ్యంగా రోడ్డు నిర్మాణాలకు అవసరమైన అటవీ శాఖ అనుమతి కోసంవివరించారు. ప్రతి సమస్యను శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

## విద్యార్థినులు హెచ్‌పివి వ్యాక్సిన్ సద్వినియోగ పరచు కోవాలి

గరివిడి మార్చి,9 ప్రభాత వార్త



విద్యార్థినులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గర్భాశయ ముఖ ద్వార కాన్సర్ నిరోధక (హెచ్ పి వి) వ్యాక్సిన్ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వెంపడాపు రమణ మూర్తి అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో ఇదే వ్యాక్సిన్ ఖరీదు ఉంటుందని,ప్రభుత్వం విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఉచితంగా అందిస్తుందని ఆయన అన్నారు. మండలంలోని కోనూరు పి హెచ్ సి లో విద్యార్థినులకు హెచ్ పి వి వ్యాక్సిన్ ను వేసే కార్యక్రమం ప్రారంభించిన వెంపడాపు విద్యార్థినులు,వారి తల్లిదండ్రులు ని ఉద్దేశించి మాట్లాడారు. వ్యాక్సిన్ వేసుకొని గర్భాశయ ముఖ ద్వారా కాన్సర్ రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. కోనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 14 ఏళ్ళు నిండి 15 ఏళ్ళులోపు వయస్సు గల 93 మంది విద్యార్థినులు అర్హులు గా ఉన్నారు. మూడు నెలల్లో ఈ కార్యక్రమం పూర్తి చేయాల్సి ఉంది. కాగా పిల్లలకు పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ పి.విష్ణు బాలాజీ ,వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేయగా కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ లెంక అప్పలనాయుడు, ఏ ఎన్ ఎం ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి మాఫియా గ్యాంగ్ పై మైనింగ్ అధికారులు ఉక్కుపాదం ..!

వార్త ప్రభావం



సాలూరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

సాలూరు నియోజకవర్గంలో మట్టి మాఫియా జోరుగా సాగుతుందని ఈమధ్య వచ్చిన వార్త దిన పత్రికలో వచ్చిన వరుస కథనాలకి భూగర్భగనుల శాఖ మైనింగ్ ఆఫీసర్స్ అక్రమ మట్టి రవాణా గ్యాంగ్ పై ఉక్కుపాదం మోపారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడంతో జిల్లాఅధికారి కె.రాము ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ పరిసర ప్రాంతల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్ బృందం ఆకస్మికదాడి చేపట్టింది. ఎలాంటి పర్మిషన్ లేకుండా నిబంధనలు అతిక్రమించి మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసారు.వెంటనే రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి ప్రాథమిక విచారణ చేపట్టారు.ఈ అక్రమ రవాణాకు బసవయ్య అనే వ్యక్తి ప్రధాన కారణమని అధికారులు గుర్తించారు.అలాగే నిందితులపై కఠిన చర్యలు ఉంటాయని అక్రమ మైనింగ్‌కు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆఫీసర్స్ వార్నింగ్ ఇచ్చారు.అంతేకాకుండ జిల్లాలో మైనింగ్ నిబంధనలను అతిక్రమించే వారిపై నిఘా మరింత కఠిన తరం చేస్తామని స్పష్టం చేసారు.భూగర్భ గనులశాఖ ఆర్.ఐ.నూర్ అహ్మద్, టి.ఎ.సంతోష్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామస్థాయిలో టీడీపీ మరింత బలోపేతం కావాలి : మంత్రి

సాలూరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలకు విస్తృతంగా వివరించాలని అలాగే స్థానిక ఎన్నికల్లో విజయం సాధించి పార్టీని మరింత బలోపేతం చేయాలని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. సోమవారం మంత్రి కార్యాలయం ఆవరణలో టీడీపీ యాప్‌కు సంబంధించిన గోడపత్రిక సంధ్యారాణి చేతుల మీదుగా ఆవిష్కరించారు.అనంతరం ఆమె మాట్లాడుతు స్టేట్ నుండి బూత్ స్థాయివరకు ప్రతి సమాచారాన్ని చేరవేయాలని క్లారిటీ ఇచ్చారు. అలాగే గ్రామ,వార్డు,నియోజకవర్గం ఇంకా జిల్లా స్థాయిలో బలో పేతానికే ఈ పోగ్రాం ఉద్దేశ్యమని తెలిపారు.ఇందులో మండల స్థాయిలో 10 మంది ఇంకా నియోజ కవర్గ స్థాయిలో 10 మంది అలాగే జిల్లా స్థాయిలో 17 మంది అనుబంధ కమిటీలు ఉంటాయన్నారు.అలాగే లీడర్ నుండి కేడర్ వరకు పార్టీ నిర్ణయాలు ఇంకా కార్యక్రమాలు తెలియజేయాలని స్పష్టం చేసారు.టౌన్ టీడీపీ ప్రెసిడెంట్ చిట్టి,సూర్యనారాయణ,పరమేష్,వేణు, యుగంధర్,ఎఎంసి డైరెక్టర్లు అక్యాన రాధ,కళావతి పాల్గొన్నారు.

## నందివానివలస, తోటపల్లి పరిసరాల్లో ఏనుగులు సంచారం

### భయాందోళనలు వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు - పంట పొలాలకువెళ్లేందుకు భయపడుతున్న రైతులు

గరుగుబిల్లి, మార్చి 9, ప్రభాతవార్త



కొమరాడ, జిఎంవలస మండలాల పరిధిలోని ఆయా గ్రామాలలో సంచ రిస్తున్న ఏనుగులు గుంపు ఆదివారం ఉదయం మండల పరిధిలోని నందివానివలస గ్రామ సమీపం లోని పరిసరాల్లో సంచరిస్తున్నాయి. నంది వానివలస గ్రామ సమీపంలోని చెరువులో కొంత సమయం సేదదీరిన ఏనుగుల గుంపు అనంతరం తోటపల్లి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో సంచరించాయి. తోటపల్లి నందివాని వలస పరిసరాల్లో ప్రస్తుతం కరిరాజులు సంచరిస్తుండడంతో ప్రస్తుతం పొలాల్లో ఉన్న నువ్వు పంటతో పాటు తదితర పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. అలాగే పంట పొలాల్లోని వ్యవసాయ మోటార్లను ధ్వంసం చేస్తాయని రైతులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నందివానివలస, తోటపల్లి గ్రామ సమీపంలో సంచరిస్తుండడం తో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియ జేశామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. తక్షణమేఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## మాకొద్దు ఈసిఆర్‌టి ఉద్యోగి

పార్వతిపురం, మార్చి 9, ప్రభాతవార్త



అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న సిఆర్‌టి ఎస్.హేమలత ను తమ మినీ గురుకుల పాఠశాలకు హెచ్‌ఎంగా నియమించవద్దంటూ పాచిపెంట ఏపిటిడబ్ల్యుఆర్ మినీ గురుకులం పేరెంట్స్ కమిటీ చైర్ పర్సన్ తామల రాజు సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా కలెక్టర్ ఆఫీస్‌లో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఆర్‌టి హేమలత అనే సిఆర్‌టి ఉద్యోగిని గత కాలంలో కారిగూడ ఏపిటిడబ్ల్యుఆర్ మినీ గురుకులంలో హెచ్‌ఎం, వార్డెన్‌గా పనిచేసి అక్కడే పలు రకములైన తప్పుడు చర్యలు, అవకతవకలపై ఆరోపణలతో అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు ఏపిటిడబ్ల్యుఆర్ మినీ గురుకులం (బాలికలు) పాఠశాలనకు బదిలీ చేసిన కూడా ఆమె ప్రవర్తనలో మార్పు రాకుండా అక్కడ కూడా గిరిజన బాలికలను వేధింపులకు గురిచేసిందన్న ఆరోపణలతో ఆమెను ఏపిటిడబ్ల్యుఆర్ (గురుకులం) తాడేపల్లి అమరావతికి సరెండర్ చేశారని అన్నారు. ఇటువంటి ఆరోపణలు, సరెండర్‌లో ఉన్న ఏపిటిడబ్ల్యుఆర్ ఉద్యోగినిని మా పిల్లలు చదువుతున్న ఏపిటిడబ్ల్యుఆర్ మినీ గురుకులం పాచిపెంటకు ఏ విధంగా బదిలీ చేస్తారు అని అన్నారు. అంతేకాకుండా సరెండర్ చేయబడిన ఉద్యోగినికి హెచ్‌ఎం, వార్డెన్(ఇంచార్జ్) బాధ్యతలు ఏ విధంగా ఇస్తారు అని అన్నారు. ఇటువంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈమెను మా గురుకుల పాఠశాల బాధ్యతలు ఇవ్వడాన్ని మేము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కావున ఏపిటిడబ్ల్యుఆర్ హేమలతని తక్షణమే మా పిల్లలు చదువుచున్న పాచిపెంట మినీ గురుకులం బాలికల పాఠశాల నుంచి బదిలీ చేయాలని లేనియెడల భవిష్యత్తులో మా గిరిజన బాలికలకు ఏ విధమైన ఇబ్బందు లు కలిగినా, అనారోగ్యములు వచ్చినా, మరి ఏ ఇతర కారణములతో అయినా మా పిల్లలకు నష్టం జరిగినా కూడా అందుకు జిల్లా ఏజెంటు టు ది గవర్నమెంట్ గా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించవలసి వస్తుందని అన్నారు. ఈ విషయంపైనే కలెక్టర్ గారిని కలిసి ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాచిపెంట మినీ గురుకులం బాలికల తల్లిదండ్రులు, ఐ టి డి ఎస్ స్వచ్ఛంద సంస్థ ఎం. పుష్పరాజు, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ఏరియా ఆదివాసి సంఘం.. ఎన్. సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ప్రారంభించినగడివలస రామమందిరాన్ని సందర్శించిన మంత్రి సంధ్యారాణి

పాచిపెంట మార్చి 9 ప్రభాతవార్త

మండలంలో గల పాచిపెంట పంచా యతీ మదురై గ్రామమైన గడివలస నూతనంగా ప్రారంభించిన రామ మందిరాన్ని రాష్ట్ర శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమ వారం సాయంత్రం సందర్శించారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని అర్చకులు మంత్రి పేరున అభిషేకం చేయించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మీ అందరి ఆదరణ వలన ఈ రోజు మంత్రి అయ్యానని ఎల్లప్పుడూ నాకు మీ ఆదరణఉండాలని ఆమె అన్నారు. అదేవిధంగా ఈ గ్రామంలో ఏ సమస్య వచ్చినా రాజకీయాలకు అతీతంగా నన్ను మీరు కలవచ్చని ఆమె అన్నారు. ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు చేసిన కృషి అమోఘమని శ్రీరామచంద్రులు గ్రామానికి సుఖసంతోషాలు కలిగిస్తారని అన్నారు. హిందువుల ఆరాధ దైవమైన శ్రీ రామ చంద్ర మూర్తి ఆలయాలు ప్రతి పల్లెలో నిర్మించి సీతారాములు పూజించడం మన సాంప్రదాయమైన అన్నారు. ఈమె వెంట మండల టిడిపి అధ్యక్షులు యుగంధర్ ఎఎంసి చైర్మన్ ముఖి సూర్యనారాయణ ఏఎంసి డైరెక్టర్ పి నర్సింగరావు పాచిపెంట ఎంపీటీసీ సభ్యులు పి ఉమామహేశ్వరరావు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మతల బలరాం, కరివలస మాజీ సర్పంచ్ తిరుపతి రావు, స్థానిక తెలుగుదేశం నాయకులు శివ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెచ్ పి వి వ్యాక్సిన్ వేయించుకోవాలి :ఎంపీడీవో సూర్యనారాయణ



వేపాడ ,మార్చి 9, ప్రభాతవార్త

అర్హులైన బాలికలందరూ హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించుకొని, క్యాన్సర్ రహిత భవిష్యత్తు నిర్మించుకోవాలని ఎంపీడీవో సిహెచ్ సూర్యనారాయణ కోరారు. వేపాడ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14-15 ఏళ్ల బాలికల కోసం ఏర్పాటు చేసిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో మహిళలకు వచ్చే గర్భాశయ క్యాన్సర్ ముప్పును నివారించడంలో ఈ టీకా రక్షణ కవచంలా పనిచేస్తుందని, బాలికల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. అర్హులైన బాలికలందరూ తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలని, తల్లిదండ్రులు, ప్రజలు ఈ విషయంలో అవగాహన పెంచుకోవాలని కోరారు. క్యాన్సర్ రహిత భవిష్యత్తు కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ పరీక్ష సామగ్రి పంపిణీ

లక్క వరపు కోట మార్చి 9 ప్రభాతవార్త



ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులకు గత కొన్నేళ్లుగా అనేక రకాలుగా విద్యా సేవలందిస్తున్న శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ 10వ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రి కిట్లను పంపిణీ చేసింది. సోమవారం విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలంలోని కల్లేపల్లి రేగ, గంగుబూడి, చందులూరు సహా వివిధ ప్రాంతాల్లోని హై స్కూల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు రెండు సెట్ల పరీక్ష సామాగ్రిని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి వేదుల మధురవాణి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వేదుల మధురవాణి పరీక్షలకు సిద్ధపడిన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయం సాధించాలని ఉద్బోధించారు. ప్రతి వ్యక్తి ఉజ్వల భవిష్యత్తుకు 10వ తరగతి మొదటి మెట్టు అని, అక్కడ బలంగా పునాది వేసుకోవాలని సూచించారు. చిన్నారుల సంక్షేమం విద్యా వైద్యం లక్ష్యంగా శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాంపురంలో శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్. తెన్నేటి సుబ్బారావు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు వేదుల సోమేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు భోజంకి చిన్నంనాయుడు, గురు ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం గరుగుబిల్లి



మెరకముడిదాం మార్చి 9, ప్రభాతవార్త

మండలం గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులనిలను ప్రధానోపాధ్యాయులు బి.ఆదినారాయణ మూర్తి, పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు మహిళలు అన్ని రంగాలలో ముందంజ వేయటానికి విద్య ఒక్కటే మార్గమని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.

## ఒక వ్యక్తిని గాయపరచి పరరైనా వ్యక్తి అరెస్ట్ బండి సిజ్ - ఎస్ఐ వెలమల ప్రసాద్ రావు

రామభద్రపురం , ప్రభాతవార్త



రామభద్రపురం మండలం పరిధిలో గల బుసయవలస కోల్డ్ స్టోరేజ్ వద్ద ఒక వ్యక్తి ని గుద్ది పరరైన వ్యక్తిని, మోటార్ వాహనం ని గుర్తించి సిజ్ చేసి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ వెలమల ప్రసాద్ రావు చెప్పిరి సిబ్బంది సహకరించిరి.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

### ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 700 మంది మహిళలకు సన్మానం

శ్రీకాకుళం, మార్చి 9 ప్రభాతవార్త:



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళంలో ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా సత్కార సభ ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళంలోని జాబిలి ఎస్ఎస్ఆర్ క్రిస్టల్ ప్యాలెస్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కేంద్రమంత్రి డా. కిల్లి కృపారాణి, మాజీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం సతీమణి తమ్మినేని వాణి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి మరియు తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన ప్రమీల హాజరై కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా నిలిపారు. కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా వివిధ రంగాల్లో సేవలందిస్తూ సుమారు 700 మంది మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల ప్రతిభను గౌరవించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. సమాజంలో వివిధ రంగాల్లో కృషి చేస్తున్న మహిళలను ప్రోత్సహించడం తమ సంస్థ లక్ష్యమని చెప్పారు. భవిష్యత్తులో కూడా మహిళల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళల ప్రతిభను గౌరవిస్తూ నిర్వహించిన ఈ సత్కార సభ శ్రీకాకుళం నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## భవన నిర్మాణ ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

కొత్తూరు, మార్చి 9 ప్రభాతవార్త :



ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్ళి భవన నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు మరణించిన కొత్తూరు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన దోమాన ఆదినారాయణ, ఇరపాడు గ్రామానికి చెందిన మచ్చ తిరుపతిరావు కుటుంబాలను ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని సీఐటీయూ కన్వీనర్ పనస రమేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాదలోని ఒక ఐదంతస్తుల భవనంపై పని చేస్తుండగా, వీరు ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన రమేష్, వారి దీనస్థితిని చూసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గ్రామాల్లో సరైన జీవనోపాధి లేక పొట్ట చేత పట్టుకుని వలస వెళ్ళిన ఈ కార్మికులు, అక్కడ వచ్చే అరకొర ఆదాయంతోనే తమ పిల్లలను చదివించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్న ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలపై ఉందని ఆయన స్పష్టం చేశారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకుని, మృతుల కుటుంబాలకు చెరో 25 లక్షల రూపాయల చొప్పున, మొత్తం 50 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మరియు స్థానిక కార్యకర్తలు పాల్గొని బాధితులకు తమ మద్దతు ప్రకటించారు.

## 13న కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

సీతంపేట, మార్చి 9 ప్రభాతవార్త



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం చేసిన విబిజి రామ్‌జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11, 12 తేదీల్లో సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ప్రచారం చేసి మార్చి 13న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా సోమవారం సీతంపేట సిపిఎం కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. సిపిఎం సీతంపేట మండలం కార్యదర్శి ఆరిక భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దావాలా రమణారావు మాట్లాడుతూ ఉపాధి కూలీల పొట్ట కొట్టి కార్పొరేట్ల లాభాల కోసం బిజెపి చేసిన కొత్త ఉపాధి చట్టాన్ని రద్దు చేయాలని, కూలీలకు, పేదలకు, రైతులకు రక్షణగా ఉన్న మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీలకర్ర శ్రీరాములు, సర్పంచ్ జీలకర్ర సుందరమ్మ, బిడ్డిక అప్పారావు, జీలకర్ర మధుసూదనరావు, కొండ గొర్రె దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## దండుగోపాల పురంలో 'ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు'

సంతబొమ్మాళి, మార్చి 9 ప్రభాతవార్త




ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు సందర్భంగా మండలంలోని దండుగోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గ్లకోమా రహిత ప్రపంచం కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వృద్ధులకు, ఆశా కార్యకర్తలకు గ్లోకోమా కంటి వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఎం.విశ్వనాథ్ గంగాధర్ మాట్లాడుతూ ప్రజలందరూ గ్లకోమా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, 40 సంవత్సరాలు పైబడిన వారు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సంపూర్ణ కంటి పరీక్షలు నిర్వహించుకొని తమ చూపును కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి ఎంఆర్‌కే దాస్ మాట్లాడుతూ ముందస్తు కంటి పరీక్షలతో గ్లకోమా అంధత్వాన్ని నివారించవచ్చని, కుటుంబ చరిత్ర గలవారు మధుమేహ వ్యాధి గల వారు, బీపీ (రక్తపోటు) ఉన్నవారు, ఎక్కువ కాలం స్టీరాయిడ్ మందులు వాడిన వారు తప్పనిసరిగా గ్లకోమా కంటి పరీక్షలు, రెటీనా పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. దానివలన కంటిచూపు కాపాడుకోవచ్చని గ్లోకోమా నిర్ధారణ అయినట్లయితే ముందుగానే గుర్తించి సకాలంలో వైద్యం అందించడం వల్ల వారి చూపును కాపాడవచ్చు అన్నారు. అవగాహన కార్యక్రమం అనంతరం 60 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీ హెచ్ ఎన్ డి కమలమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు కె కృష్ణారావు,ఫార్మసీ ఆఫీసర్ కె జనార్దనరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఉపాధ్యాయులు వితరణ

ఇచ్ఛాపురం, మార్చి 9 ప్రభాతవార్త:



మహిళా దినోత్సవం పురస్కరించుకుని సౌండ్ సిస్టమ్, మార్చింగ్ చేయడానికి ఉపయోగించే డ్రమ్‌ను ఈదుపురం కంద్ర వార్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి సిరిపురం, మందస మండలంనకు బదిలీపై వెళ్లిన సోషల్ ఉపాధ్యాయురాలు రష్మీ ప్రియదర్శిని సుమారు రూ12,000 విలువ చేసిన సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. హెచ్ఎం ఉమామహేశ్వరి మార్చింగ్ చేయడానికి ఉపయోగించే డ్రమ్ సుమారు రూ.4000 పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది భాస్కర పాడి, ఆనందరావు, సబితా కుమారి, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## బోరుభద్ర పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్‌కు ఇద్దరు ఎంపిక

సంతబొమ్మాళి, మార్చి 9 ప్రభాతవార్త



సంతబొమ్మాళి మండలం బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ ప్రతిభ ఉపకార వేతన పథకంకు ఎంపికయ్యారని హెచ్ఎం రవికుమార్ తెలిపారు. గోర్ల లక్ష్మణరావు, ఎన్.సాయి తేజలు ఈ ఏడాది ఎంపికయ్యారన్నారు. ఈ స్కాలర్షిప్ ఎంపికైన విద్యార్థులు నాలుగేళ్ల పాటు రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం అందుకుంటారన్నారు. సెలెక్ట్ అయిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. అలాగే ఇటీవల ఇదే స్కూల్ నుంచి పదవీ విరమణ చేసిన జగదాంబ టీచర్ సెలెక్ట్ అయిన విద్యార్థులకు చెరో 1000 రూపాయలు అందజేసి అభినందనలు తెలిపారు.

## రామారావు సేవలు మరువలేనివి

ఆముదాలవలస, మార్చి 9 (ప్రభాతవార్త)



విశ్రాంతి డిప్యూటీ తహసిల్దార్‌గా ఇటీవల మరణించిన పొన్నాడ రామారావు సేవలు మరువలేనివని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు అన్నారు. మెట్టెక్కివలసలో కీర్తిశేషులు రామారావు సంతాపసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ రామారావు వివిధ మండలాలలో వివిధ హోదాలలో పనిచేసి రెవెన్యూపై మంచి పట్టున్న అధికారిని ఉన్నారు. రెవిన్యూ సమస్యలపై నిరంతరం పోరాడి వారి సమస్యలను పరిష్కరించడంలో మంచి అధికారిగా గుర్తింపు పొందారని తెలిపారు. ఆయన మరణవార్త విని జిల్లాలో ఉన్న రెవెన్యూ ఉద్యోగులందరూ వచ్చి వారి కుటుంబానికి సంతాపం తెలపడం రామారావు నిజాయితీకి ఇదే నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది, మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది, కుటుంబ సభ్యులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల రక్షణ కోసమే శక్తి యాప్ పని చేస్తోంది

కోటబొమ్మాళి, మార్చి 9 ప్రభాతవార్త:



సమాజంలో బాలల రక్షణ కోసమే. పోలీస్ శాఖ శక్తి యాప్‌ను అమల్లోకి తెచ్చిందని శక్తి యాప్ టీం టెక్కలి పరిధి హెడ్ కానిస్టేబుల్ ఎం.గిరిధర్, కోటబొమ్మాళి స్టేషన్ పరిధి హెడ్ కానిస్టేబుల్ కే.గణేష్ అన్నారు. సోమవారం టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం కార్యక్రమాన్ని కోటబొమ్మాళి మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా విద్యార్థులు వారి చదువుపై దృష్టి పెట్టి బాగా చదవడానికి, వారికి ఏదైనా ఇబ్బందికర పరిస్థితులలో ఉన్నప్పుడు పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లు 181, 112, 1091 యొక్క వినియోగం గూర్చి, వేధింపులు గృహహింస, అంతేకాకుండా 1930 సైబర్ మోసానికి గురైనట్లయినా, మారకద్రవ్యాలు జరుగుతున్నట్లు తెలిసిన వాటిని నిర్మూలించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. అలాంటి సందర్భాల్లో వినియోగం కోసం 1972, 1098 బాల్య వివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఇటువంటి వాటిపై అవగాహన కలిగి సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు మీ వంతు కృషి చేస్తూ ఇటువంటి రుగ్మతలకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మహిళలు జాగ్రత్త వహిస్తూ శక్తి యాప్ను సద్వినియోగం చేసుకోవాలని, పై నెంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మహిళా కానిస్టేబుల్ కే. రమణమ్మ, (సార్వకోట ఎం. జె. పి) ప్రిన్సిపాల్ ఎస్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## జనహృదయ నేత ఎన్ఇఆర్‌కు ఘన సన్మానం

### ఎచ్చెర్ల అభివృద్ధిపై బీజేపీ నేతల ప్రశంసల జల్లు

రణస్థలం, మార్చి 9 ప్రభాతవార్త



శాసనసభ వేదికగా ఎచ్చెర్ల నియోజకవర్గ సమస్యలపై గళమెత్తి, నిరంతరం ప్రజాక్షేత్రంలో అంకితభావంతో పనిచేస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును సోమవారం బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చూపిస్తున్న చొరవ అభినందనీయమని వారు కొనియాడారు. అసెంబ్లీలో అలుపెరుగని గళం నియోజకవర్గంలోని వివిధ వర్గాల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే ఎన్ఇఆర్ అసెంబ్లీలో తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా మత్స్యకారుల జీవనోపాధి, తీర ప్రాంత వసతులపై గళం విప్పడంతో పాటు, యువతకు ఉపాధి కల్పనలో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని పట్టుబట్టారు. సాగునీటి సమస్యలు, అంగన్వావాడీ కార్యకర్తల ఇబ్బందులు, స్థానిక పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణపై ఆయన చేసిన ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అగ్రనేతల ప్రశంసలు స్పందన స్టార్ ఇటీవల నిర్వహించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్ఇఆర్ తన ప్రతిభను చాటుకుని 'స్పందన స్టార్'గా నిలిచారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వంటి అగ్రనేతల ప్రశంసలు అందుకోవడం నియోజకవర్గానికి గర్వకారణమని బీజేపీ నేతలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎన్ఇఆర్ సత్కరించిన వారిలో బీజేపీ నాయకులు సంపతిరావు నాగేశ్వరరావు, మాడుగుల శ్రీనివాసరావు, మాడుగుల సన్యాసిరావు, పలువురు పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ ఉమా సోమనాధేశ్వర ఆలయ వార్షికోత్సవాలు

సరుబుజ్జిలి, మార్చి 9 ప్రభాతవార్త



మండలంలో సరుబుజ్జిలి గ్రామంలో సోమవారం వేద పండితులు మురపాక సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో దేవాలయ అర్చకులు లోకనాథం వాసుతో గ్రామస్తులు, భక్తులు కలిసి అంగరంగ వైభవంగా శివాలయ వార్షికోత్సవాలు జరిపారు. ఉదయం ఎనిమిది గంటల నుండి శివార్చనలు, అభిషేకాలు కార్యక్రమాలు జరిపారు. మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది భక్తులు అన్న ప్రసాదాలకు పాల్గొన్నారు. అదే సమయంలో ఆర్కే ఈవెంట్స్ నుండి దొరబాబు, రామకృష్ణ వారి బృందంతో వినూత్న పాటలతో అలరారించారు. ఈ కార్యక్రమం అనంతరం ఈవెంట్ సభ్యులందరికీ దుశ్శాలువాలతో సన్మానం జరిపారు. సాయంత్రం ఉమా సోమనాధేశ్వర విగ్రహ ఉత్సవాలు తిరువీధి, తిరునాళ్లు జరిపారు. రాత్రి భజన కార్యక్రమం అనంతరం సాంప్రదాయ శివ భాగవతం జరిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, వేద పండితులు మురపాక సుబ్రహ్మణ్యం, మురపాక బాలసుబ్రమణ్యం కళాపోషకులు, కళాకారులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అధిక ధరకు మద్యం విక్రయాలు.. చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

రాజాం, మార్చి 9, ప్రభాతవార్త

రాజాం పట్టణంలో మద్యం షాపులలో బీరు, వైన్ బాటిల్స్‌పై ఎమ్మార్పీ రేట్లు కంటే అదనంగా పది రూపాయలు ఎక్కువ చేసి విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారం అంతా ఎక్సైజ్ అధికారులకు తెలిసిన చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడా లేని విధంగా రాజాం పట్టణంలోనే మాత్రమే అధిక ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నారని మద్యం వినియోగదారులు నుంచి ఎక్కువగా విమర్శలు వినిపిస్తున్నాయి. తక్షణమే ఎక్సైజ్ అధికారులు స్పందించి అధిక ధరలు విక్రయించే షాపులపై తగు చర్యలు చేపట్టాలని మద్యం వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్ రోగికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం, మార్చి 9 ప్రభాతవార్త:



ఆర్ కరాపాడు గ్రామానికి చెందిన నెయ్యల కుమార్ గత కొద్దిరోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో హాస్పిటల్‌లో జాయిన్ అయ్యారు. మెరుగైన వైద్యం కోసం దాతల సహాయం కోరగా తులసిగాం యువసేన ఫౌండేషన్, గ్రామ యువత కలిసి కుమార్ కుటుంబానికి 60,200 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

## జనసేన పార్టీ విజయానికి కృషి చేయండి : సుడా చైర్మన్ రవికుమార్

ఆమదాలవలస, మార్చి 9 ప్రభాతవార్త




జనసేన పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుల పని చేయాలని సుడా కార్పొరేషన్ చైర్మన్ కోరికాన రవికుమార్ అన్నారు. సోమవారం బ్రిడ్జి డౌన్ ఆవరణలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో యువత జనసేన పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని వారందరినీ ఒక తాటిపై తెచ్చి సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి చేయాలని అన్నారు. ప్రతి కార్యకర్తకు జనసేన పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. జనసేన సభ్యత్వం తీసుకున్న కార్యకర్తకు అని వారి కారణాలవల్ల మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల రూపాయలు పార్టీ తరఫున ప్రమాద బీమా అందజేయడం జరుగుతుందని అన్నారు. పార్టీ చేపట్టిన పలు సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకొని వెళ్లి పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలన్నారు. ఉత్తరాంధ్ర జిల్లా ఇన్‌చార్జ్ పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ జనసేన చేపడుతున్న పలు సేవా కార్యక్రమాల్లో యువతకు అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని అదేవిధంగా వారిచే సభ్యత్వం చేయించి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసేన సభ్యత్వం తీసుకున్నవారు ప్రమాదవశాత్తు ఆసుపత్రిపాలైతే తక్షణసాయంగా రూ. 50వేల వరకు మెడికల్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడం జరిగిందని అన్నారు. జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో యువతను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టి వాటికి అనుగుణంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అలాగే నియోజకవర్గంలో జనసేన సభ్యత్వం జోరుగా సాగుతుందని యువత స్వచ్ఛందంగా వచ్చి జనసేన సభ్యత్వం తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ నాయకులు డాక్టర్ పైడి నగేష్ కుమార్, జనసేన మండల నాయకుడు వీరగొట్టపు బాలమురళి, ఎస్.గణేష్, పొట్నూరు ప్రసాద్, జనసేన నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులు లక్ష్యంపై దృష్టి సారించాలి : ఎంఈఓ సిహెచ్ తిరుమలరావు

పాతపట్నం, మార్చి 9 ప్రభాతవార్త:



విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వంటి వ్యాపకాలకు దూరంగా ఉండి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సిద్ధం కావాలని పాతపట్నం మండల విద్యాశాఖాధికారి సిహెచ్ తిరుమలరావు అన్నారు. సోమవారం పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞా వికాస్ పదవ తరగతి మోడల్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ తిరుమలరావు మరియు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి చందు, పి ఖగేష్ మరియు పలు స్కూల్స్ మేనేజ్మెంట్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి ఐ.జాహ్నవి (అమర్ జ్యోతి స్కూల్), ద్వితీయ బహుమతి పి.గుణకర్ రావు (విజ్ఞాన్ స్కూల్) తృతీయ బహుమతి జి.మోనిక (రవీంద్ర భారతి స్కూల్) సాధించారు. తాము చదువుకునే రోజుల్లో ఏడో తరగతికే పబ్లిక్ పరీక్షలు ఉండేవని, ఇప్పుడు కేవలం పదో తరగతికి మాత్రమే పరిమితమయ్యాయని వారు గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు సాంకేతికత, సోషల్ మాధ్యమాలకు బానిసలై చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని, కష్టపడి చదివితేనే సమాజంలో ఒక గుర్తింపు లభిస్తుందని వారు హితబోధ చేశారు. ప్రతి ఏటా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ముందు విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ఈ మోడల్ టెస్టులు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ పరీక్షల ద్వారా విద్యార్థులు పరీక్షల్లో పాటించాల్సిన మెలకువలు తెలుసుకుంటారని, ఇది వారి వార్షిక పరీక్షల ఫలితాలపై సానుకూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల మేనేజ్మెంట్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.చరణ్, వినయ్, ఎస్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త



## బి.ఆర్.సి ఓనర్స్‌కు ఇన్పుట్స్ తయారీపై క్షేత్రస్థాయిలో శిక్షణ

కోటబొమ్మాళి, మార్చి 9 ప్రభాతవార్త:



ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా బయో రిసోర్స్ సెంటర్స్ నిర్వాహకులకు క్షేత్రస్థాయిలో ఇన్పుట్స్ తయారీపై జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో హరిచంద్రపురం గ్రామంలో తన యొక్క ఓన్ ఫీల్డ్‌లో సోమవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు రీజనల్ అధికారులు ప్రకాష్ మరియు హేమ సుందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయం బలోపేతం చేయడానికి గ్రామాలలో రిసోర్స్ సెంటర్స్ ఆవశ్యకత చాలా ఉందని అన్నారు. అలాగే శిక్షకులకు ఏటీఎం మోడల్ మరియు పలు పంటల పద్ధతిలో సాగు చేస్తున్నటువంటి పంటల విధానం మరియు కొత్తమ్మ తల్లి ఎఫ్.పి.ఓ యూనిట్‌ను సందర్శించి వాటి గురించి క్లుప్తంగా డిపిఎం పూజారి సత్యనారాయణ వివరించారు. అలాగే క్వాలిటీ ద్రవ జీవామృతం మరియు ఘనజీవామృతం అలాగే కషాయాలు తయారీని చేసి చూపించడం జరిగిందని అలాగే రీజనల్ అధికారుల సమక్షంలో విత్తన గుళికల యొక్క ప్రాముఖ్యత మరియు వాటి తయారీ విధానాన్ని మరియు వాటి ఉపయోగాలను కూలంకుషంగా వివరించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డీపీఎం ధనుంజయరావు మరియు రైతు సాధికార సంస్థ ప్రవీణ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండోర్ స్టేడియం రహదారి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఎన్ఇఆర్

రణస్థలం, మార్చి 9 ప్రభాతవార్త



మండలంలోని కొండములగాం ఇండోర్ స్టేడియం రహదారి పనుల నిర్మాణం కొరకు రూ.20 లక్షలు నిధులు మంజూరు కాగా ఆపనులను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుడిటి ఈశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఈయన వెంట దన్నాన స్వామి నాయుడు ఉన్నారు.

## బోరుకు మరమ్మత్తులు చేయించిన మున్సిపల్ కమిషనర్

### కమిషనర్ తీరుపై హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

రాజాం, మార్చి 9 ప్రభాతవార్త



రాజాం మున్సిపాలిటీ పరిధిలో అమ్మవారు కాలనీ దగ్గరలో గల మడ్డువలస నిర్వాసిత కాలనీ దగ్గరలో మంచినీటి బోరు మరమ్మతులకు గురైన అనే శీర్షికను వార్త దినపత్రికలో ప్రచురించగా మున్సిపాలిటీ కమిషనర్ రామచంద్రరావు తక్షణమే స్పందించి మరమ్మతులకు గురైన మంచినీటి చేతి పంపు బోరు బాగు చేసే విధంగా చర్యలు చేపట్టారు. ఈ విధంగా మంచినీటి చేతి పంపు బోరును బాగు చేసినందుకు గాను మున్సిపల్ సిబ్బందిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## నేరడిలో నూతన పోస్టాఫీసు ప్రారంభం

కొత్తూరు, మార్చి 9 ప్రభాతవార్త :



మండల పరిధిలోని నేరడి గ్రామంలో నూతన పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ప్రారంభమైంది. గతంలో నేరడి గ్రామానికి కేటాయించిన పోస్ట్ ఆఫీస్ మెట్టూరు గ్రామానికి తరలిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గ్రామ పెద్దలు కొత్తూరు మండల వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసీ వరప్రసాద రావు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ఎమ్మెల్యే మామిడి గోవిందరావుతో చర్చించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఉన్నతాధికారులతో మాట్లాడి, ప్రజలకు దూరమైన పోస్ట్ ఆఫీస్ సేవలను తిరిగి నేరడిలోనే అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ తులసీ వరప్రసాదరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తోందని, ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను చేర్చడమే లక్ష్యమని కొనియాడారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ పోస్ట్ ఆఫీస్ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా నూతన సేవింగ్ అకౌంట్లు తెరవడం, పొదుపు సంఘాల లావాదేవీలు నిర్వహించడం మరియు లైఫ్ టైమ్ డిపాజిట్లు కట్టడం ద్వారా పోస్ట్ ఆఫీస్‌ను బలోపేతం చేయాలని కోరారు. తమ చిరకాల వాంఛ నెరవేరడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మామిడికు మరియు లోతుగెడ్డకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోయిలాపు సంజీవు, పడాల వెంకట కృష్ణ, వడమ శ్రీను, రేగానా తిరుపతిరావు, నేరడి గ్రామ పెద్దలు భాస్కరరావు, రామరాజు, ఆదినారాయణ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సంతబొమ్మాళిలో జాతారో జాతర

### ఆదిదేవుని ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం ..పంచముఖాంజనేయుని వార్షికోత్సవం

సంతబొమ్మాళి, మార్చి 9 ప్రభాతవార్త




సంతబొమ్మాళి గ్రామంలో మూడు రోజులు పాటు కన్నులు పండుగగా జాతర జరగనుంది. ఒక పక్క ఆరోగ్య ప్రదాత, చీకటి నుంచి వెలుగును ప్రసాదించే శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం ప్రతిష్ట మహోత్సవం, మరో పక్క శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి 26వ వార్షికోత్సవం కార్యక్రమాలు జరగనున్నాయి. గ్రామస్తులు యువత, భక్తులు సహకారంతో ఈ మూడు రోజులు సంతబొమ్మాళి లో జాతరో జాతరగా పండగ వాతావరణం కనబడుతుంది. ఈ జాతర సందర్భంగా ఆలయాల పరిసరాల్లో విద్యుత్ దీపాల అలంకరణతో జిగేల్ మనిపించింది. అలాగే గ్రామ సచివాలయం నుంచి రహదారి పొడవునా విద్యుత్ దీపాల అలంకరణ సుందరముగా ఆకట్టుకుంది. మొదటి రోజున వేద పండితులు ఆధ్వర్యంలో ఆదిదేవుని ఉత్సవ విగ్రహాలకు గ్రామ ప్రదర్శన, జలాధివాసం చేసి విఘ్నేశ్వర పూజతో ప్రారంభం ఆవుతుంది. రెండో రోజు సూర్య నమస్కారాలు మహిళలచే కుంకుమ పూజ వేద పారాయణం, హోమం, ధాన్యాధివాసం, త్రిచ, అరుణ, సౌర, పారాయణ మహన్యాసం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే మూడో రోజున సూర్యనారాయణ స్వామి వారి ప్రతిష్ట ధ్వజస్తంభ ప్రతిష్ట మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించబడతాయి. ఈ సందర్భంగా మహా అన్న సమారాధన కార్యక్రమం కమిటీ సభ్యులు భక్తులు సహకారంతో నిర్వహించనున్నారు. ఈ జాతర సందర్భంగా దాండియా డాన్స్, జాలరి నాటకం, కోయ డాన్స్ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగనున్నాయి. అలాగే చివరి రోజున శ్రీ సూర్య మారుతి నాట్య కళామండలి సంతోష్ యువత ఆధ్వర్యంలో కొండవీటి సింహాలు అనే సాంఘిక నాటకం కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. అలాగే ఈ ఉత్సవాల సందర్భంగా సంతబొమ్మాళి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మోక్ష బ్లడ్ బ్యాంక్ (నరసన్నపేట ) సహకారంతో "రక్తదాన శిబిరం" కూడా ఏర్పాటు చేస్తున్నామని యువజన సంఘం సభ్యులు తెలిపారు.

## రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించండి

పాతపట్నం, మార్చి 9 ప్రభాతవార్త:



పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్, మొండిగొల వీధుల్లో రహదారుల మధ్యలో ఉండి రాకపోకలకు ఆటంకంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని స్థానిక తెదేపా నాయకులు, కాలనీవాసులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావుని కోరారు. సదరు అంశంపై ఎమ్మెల్యే గోవిందరావు ఆదేశాల మేరకు సోమవారం విద్యుత్ శాఖ ఏఈ దాంబికరావు, పంచాయతీ ఈవో రామచంద్రరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, తెదేపా నాయకులు కలిసి ఆయా వీధుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు. వీధి మధ్యలో స్తంభాలు ఉండటం వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్ అధికారులకు వివరించారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ తక్షణమే స్పందించి సంబంధిత స్తంభాలను మార్చడానికి (రీఅలైన్‌మెంట్) అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ డైరెక్టర్ శాసనపురి మధుబాబు, శ్రీ నీలమణి దుర్గా ఆలయ కమిటీ చైర్మన్ అక్కంద్ర సన్యాసిరావు, సరాలి శంకర్ మరియు తెదేపా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

